# 1

# అరుణోదయాన ఆనందం

## (ఎఫెసీయులకు 1-3)

బహుశా ఒంటరిగా అన్పించే కాలం రాత్రి చీకటి పడిన వేళే అన్పిస్తుంది. రాత్రివేళ ఒంటరిగా ప్రయాణిస్తున్న ఒక వ్యక్తికి లేదా అనారోగ్యంతో నున్న ఒక వ్యక్తి ప్రక్కన ఉన్నప్పుడు గడిచిన కాలం ఎంతో సుదీర్ఘంగా చీకటిగా అన్పిస్తుంది. అలాంటప్పుడు తొలి వెలుగు కిరణం కనబడితే చీకటి భయాలన్నీ పోతాయి. సూర్యుని తొలి కిరణాలు తాకినప్పుడు రాత్రి భయం పోయి ఆనందం కలుగుతుంది. వెలుగు ప్రతి దానికి మంచిని కలిగిస్తుంది. అరుణోదయం ఒకరికి ఎంతో ఆదరణను యిస్తుంది. నిజంగా, వెలుగు ఆనందాన్నిస్తుంది (కీర్తనలు 65:8బి).

క్రీస్తు లోనికి మార్పు చెందడాన్ని నీతిమంతులుగా తీర్చబడడంగా వాక్యం వివరిస్తుంది. సత్యం యొక్క వెలుగు గాడాంధకారాన్ని మార్చివేస్తుంది. దేవుని ధర్మశాస్త్రమును చదవని వారు, గ్రహించనివారు, లోబడనివారికి “అరుణోదయం” కలుగదు (యెషయా 8:20). మానవాళికి ఉన్న అత్యున్నత ఆశీర్వాదం ఏమంటే, దేవుని సత్య వాక్యమును చదివి గ్రహించే అవకాశం. ఒకరు వాక్యాన్ని చదువుతుండగా సత్యకిరణం వారి హృదయాల్లో ఉదయించి నిరీక్షణలేని అంధకార భయాలను తరిమి కొడుతుంది.

దేవుని సత్యం చేత “వెలిగింపబడటం” లోనున్న ఆశీర్వాదాన్ని నూతన క్రైస్తవుడు గ్రహిస్తాడు. (చూడండి హెబ్రీయులకు 6:4; 10:32). అతడు సువార్త ఆజ్ఞను గ్రహించి దానికి లోబడతాడు. అతడు దీన్ని చేసినప్పుడు వెలిగించబడిన జీవితం చీకటి జీవితాన్ని పారద్రోలుతుంది. అతని ఆత్మ దీపం చుట్టూ వెలుగుంటుంది కాబట్టి అతనికి ఆదరణ, ఆనందం దొరుకుతుంది.

మారుమనస్సులో ఏం జరుగుతుందన్న విషయాన్ని వెలిగే దీపం యొక్క అలంకారం తెలియజేస్తుంది అరుణోదయం నెమ్మదిగా చీకటిని తరిమినట్లే మారుమనస్సు ప్రక్రియలోనూ ఒకవ్యక్తి దేవుని సత్య వెలుగును నెమ్మదిగా గ్రహిస్తాడు. అరుణోదయ కిరణం భయాన్ని తొలగించినట్లే, దేవుని సత్య వెలుగు నీతిమంతుని న్యాయ విమర్శ ముందు పాపిగా నిలబడే భయాన్ని తొలగిస్తుంది. దేవుడు అందరినీ ప్రేమిస్తాడు కాబట్టి ఎవరూ నశించడం ఆయనకిష్టం లేదు (2 పేతురు 3:9, 10; యోహాను 3:16-19). క్రీస్తును ఈ లోకంలోకి పంపడం ద్వారా దేవుడు రక్షణను అందరికీ అందుబాటులో ఉంచాడు. మన పాపములను కడిగి వేసేందుకు క్రీస్తు తనను తాను బలిగా అర్పించుకున్నాడు. దేవుని రక్షణాప్రణాళికను గుర్తించి దానికి లోబడియుండడం ఎంత ఆనందకరము! ఇది ఆనందించే సమయం (అపొస్తలుల కార్యములు 16:34). మీరు క్రీస్తునొద్దకు వచ్చినప్పుడు, మీ చుట్టునున్న క్రైస్తవులు ఎంతో ఆనందిస్తారు. మీరు “చీకటి నుండి వెలుగునకు” మళ్ళి యున్నారు (అపొస్తలుల కార్యములు 26:18), ఇక ఇప్పుడు ఆత్మీయాశీర్వాదములు మీ జీవితాన్ని నింపుతాయి.

మీరు క్రైస్తవ జీవితాన్ని ప్రారంభిస్తుండగా, మీరు రక్షించబడిన విధానాన్ని మరలా చూడడం ఎంతో అవసరం. మీ ఆత్మను రక్షించిన సువార్తను జ్ఞాపకం చేసుకోండి. పాపపు అంధకారం నుండి విడుదల పొందిన తరువాత మీరు అనుభవించిన స్వేచ్ఛ మరియు దేవుని సత్య వెలుగులో మీరు కనుగొన్న ఆనందమును జ్ఞాపకం చేసుకోండి.

మన ప్రాథమిక అధ్యయనమునకు ఎఫెసీయుల పత్రికను చూద్దాము. పాపాంధకారం నుండి దేవుని వెలుగుకు మళ్ళిన విషయాన్ని జ్ఞాపకం చేసుకొమ్మని ఎఫెస్సులోనున్న విశ్వాసులను ప్రోత్సహిస్తూ పౌలు ఈ పత్రికను వ్రాస్తున్నాడు. ఈ పత్రిక చీకటినుండి దేవుని సత్య వెలుగునకు నడిపించిన దేవుని ప్రణాళికను తెలియజేస్తుంది. అలాగే "వెలుగు సంబంధులై యుండటం" అంటే ఏమిటో సూచనలు చేస్తున్నాడు (ఎఫెసీయులకు 5:8). నూతన విశ్వాసి నిమిత్తం దైవావేశిత గ్రంథం ఎఫెస్సీ పత్రిక. "నేనిప్పుడు క్రైస్తవుడను, నేనిప్పుడేమి చేయాలి?" అన్న ప్రశ్నకు ఈ పత్రిక మంచి సమాధానాన్ని ఇస్తుంది.

ఆ పాఠంలో పత్రిక మొదటి మూడు అధ్యాయాలను చూస్తాము. ఈ అధ్యాయాలలో ఎఫెస్సీయులను పాపపు అంధకారం నుండి విడిపించిన దేవుని రక్షణా ప్రణాళికను గ్రంథకర్త ఇస్తున్నాడు. ఈ ప్రణాళిక గొప్ప రక్షణ సిద్ధాంతము. రక్షణ దేవుని సంఘంలో మాత్రమే దొరుకుతుంది. దేవుని రక్షణా ప్రణాళికను మీరు ఏవిధంగా అర్థం చేసుకున్నారో నాతో కూడా ఆలోచించండి.

## చీకటి నుండి వెలుగునకు:
## క్రీస్తునందలి రక్షణ (1:3-23)

ఎఫెస్సులోనున్న విశ్వాసులను దేవుడు తన కృపతో ఆశీర్వదించాడు. వీరు రక్షణ యొక్క నిబంధనాశీర్వాదాన్ని పొందుకున్నారు (3:4-6). పత్రిక ప్రారంభంలోనే క్రైస్తవుల జీవితములకు వచ్చిన ఆశీర్వాదముల చిట్టాను ఇస్తున్నాడు. (ఈ పాఠంలోని ఆ జాబితాను చూడండి.) పౌలు యొక్క సాధారణ శుభములతో పత్రిక ప్రారంభమైన తరువాత, "మన ప్రభువైన యేసు క్రీస్తు యొక్క తండ్రి యగు దేవుడు స్తుతింపబడును గాక. ఆయన క్రీస్తు నందు పరలోకవిషయములలో ఆత్మ సంబంధమైన ప్రతి ఆశీర్వాదమును మనకు అనుగ్రహించెను" (1:3) అని వ్రాస్తున్నాడు. రక్షణ పొందిన తరువాత క్రైస్తవులు కలిగియుండే ఆత్మీయ ఆశీర్వాదముల గురించి ఈ పదాలు వివరిస్తున్నాయి.

రక్షించబడేందుకు, దేవుని కృపను పొందేందుకు ఎఫెస్సీయులు ఏం చేసారు? 2:8-10లో, ఈ క్రింది దేవుని చిత్తం ఎఫెస్సీయులను రక్షించిందని పౌలు చెప్తున్నాడు. వారు దేవుని కృప చేతనే రక్షింపబడ్డారు. ఈ రక్షణ ఎలా సంభవించింది? వారి మార్పులో ఏం జరిగింది? దేవుడు ఈ రోజున యథార్థ హృదయం నుండి కోరుకుంటున్నదే ఆ రోజు వారు చేశారు. దేవుని కృప చేత రక్షింపబడేందుకు ఎఫెసీయులు ఏం చేశారన్న విషయాన్ని గమనిస్తే ఈనాడు ప్రజలు రక్షింపబడేందుకు ఏం చేయాలో అవగతమవుతుంది.

అపొస్తలుల కార్యములు 18; 19 అధ్యాయాలలోని చారిత్రాత్మక కథనం మరియు ఎఫెసీ పత్రిక వారు ఎలా రక్షింపబడ్డారో చెప్తున్నాయి. మొదటిగా, వారు ప్రకటించబడిన సువార్తను విన్నారు (అపొస్తలులకార్యములు 18:18-21; 19:1-10; ఎఫెసీయులకు 1:13). రెండవదిగా, సువార్తను విన్న తరువాత అదే బయలుపరచబడిన దేవుని సత్యం అని వారు

నమ్మారు. ఈ నమ్మిక (విశ్వాసం) వారు యేసే క్రీస్తని, దేవుని కుమారుడని అంగీకరించేలా చేసింది (అపొస్తలుల కార్యములు 19:17; ఎఫెసీయులకు 1:13, 15). మూడవదిగా, క్రీస్తే దేవుని కుమారుడని వారు నమ్మడం వలన ఇతర అన్య నమ్మకాలనుండి వేరు తిరగారు. వారి అసత్య నమ్మకాల నుండి వెనుదిరిగి, విడిచి పెట్టి దేవునికి వ్యతిరేకంగా నున్న ఆచారాలను ఆచరించడం ఆపివేసారు (అపొస్తలుల కార్యములు 19:17–20). నాల్గవదిగా, దేవుని కుమారుడైన క్రీస్తును తమ జీవితాలలో ప్రభువుగా ప్రతిష్ఠించుకుని, పశ్చాత్తాపపడి క్రీస్తు ఆజ్ఞలో నిలిచియుండేలా తీర్మానించుకున్నారు (అపొస్తలుల కార్యములు 19:17బి, 18). ఐదవదిగా, క్రీస్తు సంఘంలో భాగమవ్వాలంటే (దేవుని కుటుంబంలో ఒకరు, పాపక్షమాపణ నొందిన ఆత్మగా) ఒకరు నీళ్ళలో ముంచబడి లేక బాప్తిస్మం పొందాలి అని నేర్చుకున్నారు. కొంత మంది క్రీస్తు నిర్దేశించిన ప్రకారం గాకుండా భిన్నంగా ఇది వరకే (బాప్తిస్మం పొందారు) ముంచబడ్డారు కాబట్టి వారు మరలా ముంచబడాలి (అపొస్తలుల కార్యములు 19:2–5). క్రీస్తు నిర్దేశించిన బాప్తిస్మం పాపక్షమాపణ నిమిత్తమైన బాప్తిస్మం (మత్తయి 28:18–20; మార్కు 16:15, 16; అపొస్తలుల కార్యములు 2:38; 22:16). ఆరవదిగా, వారి బాప్తిస్మం వారిని క్రీస్తులోనికి ఉంచింది. “క్రీస్తులో” అన్న మాట ఎఫెసీయులు క్రీస్తు శరీరమనే సంఘములో భాగమై యున్నారు అని సూచిస్తుంది. ఆయన శరీరమే సంఘం (కొలొస్సయులకు 1:18). క్రీస్తు నందున్న వారు మాత్రమే రక్షించబడతారు. ఎందుకంటే, ఆయనయందు ఉంటేనే ఎఫెసీయుల పత్రికలో ఇయ్యబడిన ఆత్మీయ ఆశీర్వాదాలు లభిస్తాయి. క్రీస్తునందు ఉండేందుకు ఎఫెసీయులు చేసిన వాటన్నిటిని చేస్తేనే గాని ఒకరు క్రీస్తులో ఉండలేరు.

ఎఫెసులోనున్న క్రైస్తవులకు దేవుని రక్షణా నిబంధన తీసుకువచ్చిన ఆశీర్వాదములు ఏమిటి? క్రీస్తులో నుండేందుకు వారు చేసిన వాటినే చేసిన ఈనాటి వారికి అవే ఆశీర్వాదములు కలుగుతాయి. క్రీస్తు శరీరమైన ఆయన సంఘంలో భాగమైన వారికి దొరికే ఆశీర్వాదముల గురించి ఎఫెసీయులకు 1:3–23 చదవండి. క్రైస్తవులుకు ఇవి దొరుకుతాయి:

- ఈ లోక ఆశీర్వాదముల కంటే గొప్పవైన పరలోక ఆశీర్వాదములు (3 వచనం)
- విలువైన దేవుని సొత్తుగా కుమారులుగా ఉండే ఆధిక్యత (4 వచనం)
- దేవుని దత్తపుత్రులముగా ఉండే ఆశీర్వాదము (5, 6 వచనాలు)
- పాపముల నుండి విమోచన అనగా క్షమాపణ అనే ఆశీర్వాదం (7 వచనం)
- ఆత్మీయ సత్యములను గ్రహించే జ్ఞాన వివేచనా ఆశీర్వాదము (8, 17, 18 వచనాలు)
- ఇతర క్రైస్తవులతో సహవాసం కలిగియుండేలా దేవుని రక్షణా ప్రణాళికను ఎరిగి యుండే ఆశీర్వాదము (9, 10 వచనాలు)
- పరలోక స్వాస్థ్యమును పొందే ఆశీర్వాదము (11, 12 వచనాలు)
- పరిశుద్ధాత్ముని చేత ముద్రించచబడే ఆశీర్వాదము (13 వచనం)
- నిత్య విమోచన కొరకు చెల్లించిన సంచకరువు లేక వాగ్దానమును గూర్చిన ఆశీర్వాదం (14 వచనం)
- విశ్వాసులైన సహోదరులతో ప్రేమతో కూడిన సహవాసం కల్గియుండే ఆశీర్వాదం (15 వచనం)

- తోడి సహోదరుల విడువని ప్రార్థనల ఆశీర్వాదం (16 వచనం)
- తండ్రియైన దేవుని నుండి ఆత్మీయ సహాయ ఆశీర్వాదం (19 వచనం)
- దేవుని క్రియల పరిచర్య యందు ఆశీర్వాదం (20-23 వచనాలు).

ఒకవ్యక్తి దేవుని సత్య సువార్తను గ్రహించి దాన్ని విశ్వసించి దేవుని ఆజ్ఞకు లోబడి తన పాపక్షమాపణ నిమిత్తం బాప్తిస్మం పొంది, భక్తిగా దేవునితో జీవిస్తూ ఉంటే ఆత్మీయ ఆశీర్వాదములు కలుగుతాయి. ఈ పనులు ఆ వ్యక్తిని దేవుని కృపా నిబంధనలోకి తీసుకువస్తాయి. దేవుని రక్షణా ప్రణాళికను గ్రహించడం ఆ ఆజ్ఞలకు లోబడియుండడం ద్వారా అతని ఆత్మ దీవించబడుతుంది. ఒక క్రైస్తవుడు తనకు దేవునితో గల నిబంధనా సంబంధాన్ని గుర్తు చేసుకున్నప్పుడు ఆనందం కలుగుతుంది. అది చీకటిని తరిమి కొడుతుంది తద్వారా దేవునికి కృతజ్ఞతాస్తుతి చెల్లించబడుతుంది!

## నిరాశనుండి నిరీక్షణకు: క్రీస్తులో సమాధానపరచబడడం (2:1-22)

వాక్యంలోనున్న అద్భుత అధ్యాయాల్లో ఎఫెసీయులకు 2 కూడా ఒకటి. ఈ అధ్యాయం రక్షణా విధానాన్ని వివరిస్తుంది!. పాపపు అంధకారంలోనున్న నిరాశ నిస్పృహలను వివరిస్తూ ఈ అధ్యాయం ప్రారంభమవుతుంది. అటువంటి స్థితిలోనున్న వారికి తప్పించుకునేందుకు ఇయ్యబడిన అవకాశం గురుంచి ఇది చెప్తుంది, పాపాంధకారం నుండి నీతియను వెలుగువైపు మళ్ళిన వారి జీవితాలను గురించి ఆఖరు వచనాలు చెప్తున్నాయి. మారుమనస్సు ప్రక్రియలో ఏం జరుగుతుందన్న విషయాన్ని ఈ వాక్యం చెప్తుంది. దీనిని క్లుప్తంగా ఇక్కడ చూద్దాము.

*మొదటిగా, పాపంలోని నిరాశను మనం చూస్తున్నాము* (2:1-12). పత్రిక గ్రహీతలు క్రీస్తులోనున్నా, దేవునితోనున్న ఆశీర్వాదాలను వారనుభవించినా, వారు మరింతగా దీవించబడలేకపోయారు. క్రీస్తులోనికి కూడా బాప్తిస్మం పొందక ముందు వారు ...

- పాపం చేత చనిపోయి ఉన్నారు (1, 5 వచనాలు).
- సాతాను స్వాధీనంలోనున్నారు కాబట్టి అవిధేయులైయున్నారు (2 వచనం).
- ప్రాపంచిక ఆశలలో నున్నారు (3 వచనం).
- వారు దేవునికి వేరై యున్నారు కాబట్టి నాశన పాత్రులై యున్నారు (11, 12 వచనాలు).

పాపాంధకారంలోని జీవితం భయంకరంగా ఉంటుంది. అటువంటి జీవితం అనుభవించినవారు నిరాశలో నున్నారు. క్రైస్తవుడు దీన్ని జ్ఞాపకం చేసుకుని దేవుడు అందించిన రక్షణకై స్తుతి చెల్లించాలి (2:8, 9). ఆ రక్షణా ప్రణాళికను గ్రహించి దానికి లోబడిన వారందరూ నూతన సృష్టియై ఆత్మీయ మరణం నుండి తప్పించబడతారు. పాప జీవితంలోనున్న నిరాశ వలన దైవ రక్షణకై క్రైస్తవుడు కృతజ్ఞత కలిగియుండాలి. పాప జీవితంను విడిచిపెట్టువారికి అద్భుత ఆశీర్వాదములు అందించబడతాయి.

*రెండవదిగా, సమాధానపరచబడడంలోని ఆనందాన్ని మనం చూస్తున్నాము* (2:13-18). పాపపు అంధకారం దేవుని కనికరము చేత తొలగించబడింది. "క్రీస్తుయేసునందున్నవారు"

(13 వచనం). పూర్తిగా వేరే పరిస్థితిలో ఉంటారు. ప్రజలందరూ రక్షించబడేందుకు దేవుడు తన ఏకైక కుమారుని బలిగా అర్పించాడు (యోహాను 3:16). ఆ బలియాగం ద్వారా క్రీస్తు దేవ వ్యతిరిక్త ప్రపంచాన్ని తనతో సమాధానపరుచుకున్నాడు. పాపం చేత చెడిపోయినందున దేవుడు మరియు మానవుడు మధ్యగల సంబంధానికి శతృత్వం ఏర్పడింది. పాపం వలన కలిగిన అహంకారమును బట్టి మనుష్యుల మధ్యనూ శతృత్వం ఏర్పడింది. పాపం వలన వైషమ్యాలతో నిండిన ఈ లోకంలో క్రీస్తు "సమాధానాన్ని ప్రకటించాడు" (17 వచనం). ఆ సువార్తను విన్న వారందరూ సమాధానాన్ని కనుగొంటారు. ఇకమీదట శతృత్వం ఉండదు; యుద్ధం ఉండదు.

ఈ యుద్ధంలో ప్రతి క్రైస్తవుడు ఒకప్పుడు దేవునికి శతృవే! దీన్ని కొంతమంది కాదన్నా, ఇప్పుడు క్రైస్తవుడైన ప్రతి ఒక్కరూ ఒకానొకప్పుడు సాతాను పక్షంగా నుండి దేవుని ఓడించేందుకు ప్రయత్నించిన వారే! అతడు లేదా ఆమె క్రైస్తవులైనప్పుడు ఆ సహాయం, ప్రయత్నాలు సాతానుడి పక్షంనుండి దేవుని పక్షానికి చేరాయి. మన ఒకప్పటి శతృత్వాన్ని, వైరిని దేవుడు ఇప్పుడు క్షమించడం ఎంత ఆశ్చర్యకరం! క్రైస్తవులు ధన్యులు ఎందుకంటే, దేవుని ప్రేమపూర్వకమైన క్షమాపణకు క్రీస్తు మార్గాన్ని ఏర్పరచినాడు.

*మూడవదిగా, దేవునికి చెందియుండటం లోని పవిత్రతను మనం చూస్తున్నాము* (2:19–22). రక్షణ క్రైస్తవునికి సమాధానం, నూతనత్వాన్ని అనుగ్రహించి పాపపు నిరాశను తొగించడం మాత్రమే గాకుండా, అతడు దేవుని విషయంలో, భక్తి కలిగియుండేలా చేస్తుంది. ఈ పదానికి అర్థం క్రైస్తవుడు క్రీస్తు రక్తంలో రక్షింపబడి దేవుని స్నేహితుడుగా ఉండేలా సమాధానపరచబడి, ఆయనతో ప్రత్యేక సంబంధం కలిగియుంటాడు. రక్షింపబడిన క్రైస్తవుడు దేవుని పరిశుద్ధ మందిరములో ఒక భాగమవుతాడు. ఈ ఆలయంలో భాగంగా, క్రైస్తవుడు దేవుని పరిచర్య నిమిత్తం వేరు పరచబడి రక్షించబడ్డ ఇతరులతో సహవాసం కలిగియుంటాడు. అతడికమీదట దేవుని శతృవు కాడు. అలాగే దేవునికి వ్యతిరేకంగా ఉండలేడు. ఇప్పుడు దేవుని పక్షంగా ఇతర క్రైస్తవులతో పని చేస్తాడు. ఇక్కడ ఇతనిక మరియు "చచ్చినవానికి" (2:1) మధ్య ఉన్న వ్యత్యాసం ఎంత ఆశ్చర్యకరమైనది!

## గందరగోళం నుండ దృఢనిశ్చయతకు:<br>క్రీస్తులో నిశ్చయత (3:1–19)

నూతన క్రైస్తవునికి ఆత్మీయ విషయాలలో నిశ్చయత ఉంటుంది. ఎఫెసీయులకు మారుమనస్సు గురించి చెప్తూ ప్రజల రక్షణ అనేది దేవుడు సులభతరం చేసాడని గుర్తు చేస్తున్నాడు. మనిషిని మనిషితో, మనిషిని దేవునితో సమాధానపరచడమే దేవుని రక్షణా ప్రణాళిక. ఒకానొక సమయంలో ఈ సమాధానపరిచే పని అయ్యేదిగా అన్పించలేదు. ఈ ప్రణ ాళిక కాస్త అయోమయంగా, గంధరగోళంగా అన్పించింది (అది ఓ "మర్మము"; 3వ వచనం). ఈ అత్యద్భుత ప్రణాళిక పాత నిబంధన ప్రవక్తల చేత కొంచెం కొంచెంగా బయలుపరచబడింది (యెషయా 28:10). క్రీస్తు మరణం తరువాత ఇది స్పష్టం చేయబడింది. అపొస్తలులు మరియు మొదటి శతాబ్దపు ప్రవక్తలు ఈ విధానాన్ని విశదపరిచారు. వారు దేవుని రక్షణా ప్రణాళికను వివరించారు. తద్వారా వాక్యాన్ని చదివే వారందరూ దాన్ని గ్రహించగలరు.

నూతన క్రైస్తవుడుగా మీరు కదల్చబడని నిశ్చయతను కల్గియుండవచ్చు. మీరు దేవుని

చిత్తానికి లోబడ్డారని మీకు తెలుసు. మీ విధేయత ఎఫెసీ 1లో ఇయ్యబడిన ఆశీర్వాదాలను పొందేలా చేస్తుంది. ఈ నిశ్చయత ద్వారా సాతానుని శోధనలను మీరు ఎదురించగలరు. అలాగే దాని సహాయంతో మీ రక్షణను గురించి ఇతరులతో చెప్పగలరు. ఒక క్రైస్తవునిగా, మీకు ఈ హామీలున్నాయి:

- మీ జీవితం పట్ల దేవుని చిత్తం విషయమైన జ్ఞానం (4 వచనం)
- దేవునికి లోబడియుండేందుకు తీర్మానించుకున్న ఇతర విశ్వాసులతో సహవాసం (6 వచనం)
- "శోధింపశక్యముకాని క్రీస్తు ఐశ్వర్యములో" పాలి భాగం (8 వచనం)
- దేవుని సంఘాన్ని విస్తరింపచేసే భాధ్యత (9, 10 వచనాలు)
- ఆత్మీయ విషయంలో బలం సాధించేందుకు ప్రార్థనా శక్తి (14-19 వచనాలు)

లోకంలో జీవిస్తున్న వారికి నిశ్చయత అంతగా ఉండదు. అనేకమంది నిరాశ నిస్పృహల్లో ఉంటారు. రక్షణ జీవితము ప్రతి అంశంలోనూ నిశ్చయతను అందిస్తుంది కాబట్టి క్రైస్తవుడు ధన్యుడే! క్రైస్తవుని నడకను మీరు ప్రారంభిస్తుండగా, దేవుని వాగ్దానాలను ఎరిగి యుండండి. చీకటి నుండి వెలుగుకు తిరుగుతూ మీ ఆత్మ రక్షణ విషయమై ధన్యమైన నిశ్చయతను మీరు గుర్తిస్తారు. ఎంతో మంది ఆశించిన సమాధానాన్ని క్రైస్తవ్యం మీరు ఒక వరముగా అందిస్తుంది.

### బలహీనత నుండి బలమునకు: క్రీస్తులో నిరంతర సహాయం (3:20, 21)

దేవుని శక్తియందు నమ్మికయుంచుమని ఈ వచనాలు విశ్వాసాన్ని సూచిస్తున్నాయి. క్రైస్తవునిగా ఈ నడకను ప్రారంభిస్తుండగా, పాత శోధనలు మరింత బలంగా ఉంటాయని, పశ్చాత్తాపపడాలన్న మీ నిర్ణయాన్ని మార్చుకునేలా చేస్తాయని మీరు భయపడవచ్చు. ప్రార్థనా శక్తిని నూతన క్రైస్తవుడు మర్చిపోవచ్చు. ఎఫెసీయులకు 3లోని చివరి మాటలు స్థిర వాక్యాన్ని ఇస్తున్నాయి; మీకున్న సమస్యలన్నిటి కంటే దేవుడు గొప్పవాడు. మీరు ఆయనయందు నమ్మిక యుంచి మీ జీవితంలో ఆయన చిత్తాన్ని జరిగించితే మీరు అద్భుత ఆశీర్వాదాలను చవిచూస్తారు.

నూతన క్రైస్తవుడు దేవుని మహిమను సంఘంలో వెదుకుతాడు. మీరు ఎన్నో పనులు చేయాల్సి ఉంటుంది. సంఘ కార్యక్రమాలకు హాజరవ్వాలి. అలాగే దేవుని సంఘాన్ని కట్టేందుకు సిద్ధం కావాలి (చూడండి ఎఫెసీయులకు 2:19-22).

దేవుని ఆజ్ఞలను అనుసరించేందుకు శ్రమ పడుచున్న వారికందరికి స్థిర సహాయం అందుబాటులో ఉంది. మీరు నిరుత్సాహపడవద్దు. "మనము అడుగువాటన్నిటికంటెను, ఊహించువాటన్నిటి కంటెను దేవుడు అత్యధికముగా చేయగలడు" (20 వచనం). ఎఫెసీయులకు మొదటి రెండు అధ్యాయాలలో చెప్పబడిన గొప్ప విషయాలను చేసిన గొప్ప దేవుడు, మీ క్రైస్తవ జీవితంలో మీకు నిరంతరం సహాయంగా ఉంటాడు.

## ముగింపు విషయాలు

రాజుగారి ద్రాక్ష తోటనుండి ఒక ద్రాక్షల గుత్తిని ఆశించిన స్త్రీని గురించిన కథను ఒక సంఘ మాసపత్రికలో వ్రాసారు. ఆమెకు అనారోగ్యంతో నున్న ఒక బిడ్డ ఉంది. ఆబిడ్డ ద్రాక్షలను రుచి చూడాలనుకుంది. దాంతో ఆ తల్లి వెళ్ళి ద్రాక్షతోటలోనున్న వ్యక్తిని కొన్ని కాయల కోసం అడుగగా, అతడామెను నిర్ధాక్షిణ్యంగా బయటకు తోసేసాడు. తరువాత ఆమె కొంత డబ్బును ద్రాక్షలు కొందామని పట్టుకొని రాగా, మరలా ఆమెను బయటకు తోసేసాడు. రాజు కుమార్తె ద్రాక్షతోటలోని వ్యక్తి మాటలను, ఆ దీనురాలి అభ్యర్ధనను విన్నది. ఆమె ఆ తల్లి వద్దకు వచ్చి ఏం కావాలని అడిగింది. అందుకామె తన దీనగాధను చెప్పి అనారోగ్యంతో నున్న తన బడ్డ ద్రాక్షపళ్ళను అడిగిందని చెప్పింది. ఆ పరిస్థితిని రాజుకుమార్తె విని ఇలా అంది, “అమ్మా, మా నాన్న ద్రాక్ష పళ్ళను అమ్మువాడని నువ్వు తప్పుగా అర్థం చేసుకున్నావు. ఆయన వ్యాపారి కాదు, రాజుగారు. ఆయన పని అమ్మటం కాదు, ఇవ్వడం.” తరువాత రాజు కుమార్తె పెద్ద పెద్ద ద్రాక్షగుత్తులను కోసి ఆమెకు ఇచ్చింది. ఆ తల్లి వెలతో సంపాదించలేని దాన్ని ఉచితంగా పొందింది.

పాపపు అంధకారాన్ని తప్పించుకోవడానికి పరలోకమందున్న తండ్రి కూడ ఒక తరుణాన్ని ఇచ్చాడు. అంధకారపు అమాయకత్వంన్ని, అవమానాన్ని విడిచిపెట్టి దేవుని చిత్తంయొక్క వెలుగు అనుభవాన్ని మనం పొందుకోగలము. పరలోకమందున్న గొప్ప తండ్రి మనల్ని ప్రేమిస్తున్నాడని, ఆయనతో సహవాసానికి మనల్ని ఆహ్వానిస్తున్నాడని అర్థం చేసుకున్న వారి హృదయాల్లో వర్ణించలేని అద్భుత ఆనందం ఉంటుంది, ఈ ఆశీర్వాదం ఉచితంగా అందరికి అందించబడింది (ప్రకటన 22:17). ఎంతో మహిమాశీర్వాదం! దీనికున్న ఏకైక అర్హత ఆయన మాటను చదివేందుకు (లేదా వినేందుకు), అధ్యయనం చేసేందుకు, గ్రహించేందుకు, లోబడేందుకు సమ్మతించడం.

అంధకార భయమును, నిరాశలను అరుణోదయపు వెలుగు తరిమికొడుతున్నందుకు దేవునికి స్తోత్రం.